క్లుప్తంగా

ఉగ్రవాదం నిర్మూలించాలి



నిరసన తెలుపుతున్న భజరంగ్‌దళ్ నాయకులు

గుంతకల్లుటౌన్: ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని భజరంగ్‌దళ్ నాయకులు కోరారు. ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడాన్ని జీర్ణించుకోలేని ఉగ్రవాదులు జమ్మూ కాశ్మీర్ వద్ద శ్రీవైష్ణవి దేవి ఆలయాన్ని సందర్శించుకుని బస్సులో వస్తున్న హిందువులపై జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర భజరంగ్‌దళ్ సాప్తహిక్ కన్వీనర్ సి.రవి తెలిపారు. భజరంగ్‌దళ్ జాతీయ కమిటీ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఉగ్రవాదం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఉగ్రవాదాన్ని రూపుమాపడానికి కేంద్రం కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ పట్టణ కార్యదర్శి వి.ప్రభాకర్, పట్టణ సేవాప్రముఖ్ బండిమురళి, నాయకులు నారాయణరెడ్డి, మోహన్, నెట్టికంటి, విశ్వనాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల కేంద్రంలోని డ్యాం రోడ్డు సమీపంలో రూ.5 లక్షలు ఎంపీ నిధులతో నిర్మించిన 150 మీటర్ల సీసీ రోడ్డును గురువారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సీసీ రోడ్డు నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాణా ప్రతాప్, జగదీష్, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బోర్లు వేయడం, చెడిపోయిన బోర్లను ఫ్లషింగ్ చేయడం, పైప్‌లైన్‌లు మరమ్మతు చేయడం, బోర్లు రిపేరీ చేయిస్తున్నామన్నారు. సమస్య తీవ్రంగా ఉన్నచోట ట్యాంకర్లతో నీరు సరఫరా చేయిస్తున్నామన్నారు. త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

రౌడీ షీటర్లు, వివాదాస్పద వ్యక్తులపై నిఘా



చాలవేముల గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

పుట్లూరు: రౌడీ షీటర్లు, వివాదాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచామని, ఘర్షణకు ప్రేరేపిస్తే కఠిన చర్యలు తప్పవని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని చాలవేముల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈయన వెంట ఎస్ఐ హేమాద్రి ఉన్నారు.

సమస్యలు సృష్టిస్తే జైలుకే..



మాట్లాడుతున్న ఎస్ఐ గిరిబాబు

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపుతానని ఎస్ఐ గిరిబాబు హెచ్చరించారు. పాతపల్లి, జంగంపల్లి, వెన్నపూసపల్లి, గడ్డంవారిపల్లి తదితర సమస్యాత్మక గ్రామాల్లో ఎస్ఐ పర్యటించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఏవైనా అలజడులు సృష్టించినా, శాంతిభద్రతలకు విఘాతం కల్పించినా జైలుకు పంపుతానన్నారు. రాజకీయంగా, భూములు, రస్తా సమస్యలు ఉన్నవారు స్టేషన్‌కు వచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్ఐ సూచించారు.

సిరుల పూబంతి



చిన్నపప్పూరులో సాగుచేసిన బంతిపూల పంట

- మార్కెట్‌లో బంతిపూలు కిలో రూ.50 నుంచి రూ.90
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

పెద్దపప్పూరు: బోలెడు పెట్టుబడులు పెట్టి నష్టాలు చవిచూసేకన్నా, బోరుబావులకింద తక్కువ పెట్టుబడితో సాగు చేసిన బంతి పూల తోటలు రైతుల్లో ఆశలు చిగురింపచేస్తున్నాయి. ప్రస్తుతం పంట కోత ప్రారంభంలోనే మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.90 ధర పలుకుతుండడంతో ఆశించిన రీతిలో పంట దిగుబడితో పాటు ఆదాయాన్ని పొందుతున్నారు. పంట కోత ప్రారంభ దశలోనే ఆశించిన ధర లభిస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దపప్పూరు, తాడిపత్రి, యాడికి, మండలాల్లో అధికారుల ఈ–క్రాప్ బుకింగ్ మేరకు బంతి, చామంతి పంటలను దాదాపు 102 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం, తాడిపత్రి తదితర పట్టణాల్లోని మార్కెట్లలో కిలో బంతిపూలు రూ.50 నుంచి రూ.90 వరకు ధర పలుకుతోంది. బంతి, చామంతి మేలైన రకాల మొక్కలను చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి తెప్పించి సాగుచేస్తున్నారు. నాటిన 50 రోజుల నుంచి నెలరోజుల పాటు పూలు కోతకు వస్తాయి. ఎకరాకు నేల స్వభావాన్ని బట్టి 2 టన్నుల నుంచి 4 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతన్నలు తెలిపారు. పంట సాగు కోసం ఎకరాకు రూ.40 వేల నుంచి రూ. 50 వేల వరకూ ఖర్చువుతుందంటున్నారు.

ధర పెరిగితే మరింత ఆదాయం వస్తుంది



ప్రస్తుతం మార్కెట్టులో పూల నాణ్యతను బట్టి కిలో రూ.50 నుంచి రూ. 90 ధర పలుకుతోంది. ఇదే ధర ఇలాగే కొనసాగితే ఎకరాకు లక్ష రూపాయల ఆదాయం వస్తుంది. ప్రస్తుతం రోజూ కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు పూల నాణ్యత దెబ్బతింటోంది. రెండు నెలల పాటు వివాహ ముహూర్తాలు లేకపోవడంతో మార్కెట్‌లో ఇదే ధర కొనసాగవచ్చని భావిస్తున్నాం.

– ఈశ్వర్‌రెడ్డి, చిన్నపప్పూరు, పెద్దపప్పూరు మండలం

నాణ్యతను బట్టి మార్కెట్‌లో ధర



ఈ నెలలోనే పంటకోత ప్రారంభమైంది. ప్రస్తుతం మార్కెట్టులో మంచి ధర పలుకుతోంది. బంతి, చామంతి పంటలకు మచ్చతెగులు రాకుండా మందులు పిచికారీ చేస్తే పూల నాణ్యత బాగుంటుంది. బంతి, చామంతి పంటలు ప్రస్తుతం మొగ్గ దశలో ఉంది. వచ్చే నెల నుంచి దిగుబడి పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

–ఉమాదేవి, హెచ్ఓ, తాడిపత్రి

దంచి కొడుతున్న వాన



పందుల వాగు సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

తాడిపత్రి: తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా వానలు దంచి కొడుతున్నాయి. గత కొద్ది రోజులుగా వర్షాలు బాగా కురుస్తుండడంతో మండలంలోని వాగులు, వంకలు జళకళ సంతరించుకుంటున్నాయి. బుధవారం నియోజకవర్గంలోని తాడిపత్రి మండలంలో 34.4 మి. మీటర్ల వర్షపాతం నమోదైంది. యాడికిలో 13.4 మి. మీ, పెద్దపప్పూరులో 9.8 మి. మీ, పెద్దవడుగూరులో 5.6 మి. మీటర్ల వర్షపాతం కురిసింది.

పెద్దవడుగూరు: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో రైతులు పొలాల్లో పనులు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

పామిడి: మండలంలో గురువారం చిరుజల్లు కురిశాయి. గత ఎనిమిది రోజులుగా మండలాన్ని వర్షం వదలడం లేదు. దీంతో పనులు లేక కూలీలు, భవన నిర్మాణ కార్మికులతో పాటు ప్రజలు బేజారు పడుతున్నారు. మరోవైపు వీధులు, రోడ్లు చిత్తడి, బురద, వర్షపునీటిమయమైవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మోగిన బడిగంట





గుత్తి మండలం బేతాపల్లిలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

పామిడి: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు పునః ప్రారంభానికి నోచుకున్నాయి. బడిగంట మోగడంతో విద్యార్థులు బడి బాట పట్టారు. పామిడిలోని స్పెషల్‌వార్డు స్కూల్‌లో విద్యాకానుక కిట్లను ఎంఈఓ జయానాయక్ చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు టెక్ట్స్ బుక్‌లు, నోట్‌బుక్‌లు, బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం అయ్యాయి. సెలవుల అనంతరం తెరుచుకున్న పాఠశాలల ఆవరణలోని చెత్తాచెదారాన్ని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శుభ్రం చేయించారు. మండలంలోని 74 పాఠశాలల్లో మొదటి రోజు 30 శాతం విద్యార్థులు హాజరయ్యారు.

యల్లనూరు: మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు గురువారం పున:ప్రారంభమయ్యాయని ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలతో పాటు కస్తూర్బా విద్యాలయం, ఆదర్శ పాఠశాలలు తెరుచుకున్నాయి. అన్ని పాఠశాలల్లో యూనిఫాం, బ్యాగులు, షూ, నోటు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కాగా మండలంలోని పాతపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ–2 పరమేశ్వరరెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, తరగతి గదుల శుభ్రతను పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు కుళ్లాయప్ప ఉన్నారు.



పామిడి స్పెషల్‌వార్డు స్కూల్‌లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ జయానాయక్



పాతపల్లి పాఠశాలలో హాజరుపట్టికను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 పరమేశ్వరరెడ్డి

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



యాడికి: ఆటోల ద్వారా మండలంలోని పాఠశాలలకు పుస్తకాలను తరలిస్తున్న ఎంఈఓ

యాడికి: మండల వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందజేసేందుకు ఇప్పటివరకూ 20 వేల పుస్తకాలు నంబర్–1 ప్రాథమిక పాఠశాలకు చేరినట్లు ఎంఈఓలు కాశెప్ప, ధనలక్ష్మి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ 2,400 బెల్ట్‌లు, 3,450 బూట్లు, 21,150 నోటు పుస్తకాలు వచ్చాయన్నారు. 4వ తరగతి పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. గురువారం పాఠశాలలు ప్రారంభం కావడంతో మండలంలోని 35 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత, ఆదర్శ పాఠశాల, కస్తూరిభా గాంధీ విద్యాలయానికి ఆటోల ద్వారా పుస్తకాలు సరఫరా చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

23 పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ

పెద్దవడుగూరు: మండలంలోని 23 ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ రాముడు తెలిపారు. మొదటి విడుతలో మండలానికి 8,400 పుస్తకాలు రాగా రెండో విడుతలో 6,300 పుస్తకాలు వచ్చాయన్నారు. బ్యాగులు, యూనిఫాం, షూలు వచ్చిన వెంటనే విద్యార్థులకు అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని వారు కోరారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉంటుందన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాలను గురువారం పాఠశాలలకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండలవ్యాప్తంగా 46 పాఠశాలల్లో 2,481 మంది విద్యార్థులు ఉండగా 5,613 పాఠ్యపుస్తకాలు, 14,882 నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. వాటిని అన్ని పాఠశాలలకు సరఫరా చేసి విద్యార్థులందరికీ పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరిక



అంగన్‌వాడీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పద్మనాభయ్య ఫ్యాక్టరీ అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతూ ఐదేళ్లు పూర్తైన పిల్లలు గురువారం ప్రభుత్వ పాఠశాలలో చేరారు. అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి ఐదుగురు పిల్లలను హోరబ్ చర్చి సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. తల్లులను వెంటబెట్టుకుని పాఠశాలకు వెళ్లి పిల్లలను ఒకటో తరగతిలో అడ్మిషన్ చేయించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు

పెద్దవడుగూరు: శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని యాడికి రూరల్ సర్కిల్ సీఐ రోషన్, ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ లో పాత కేసుల్లోని రౌడీ షీటర్లు, నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఘర్షణలకు పాల్పడినా, గొడవలు చేయడానికి తోడ్పాటు అందించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురం వద్ద ఉన్న పెన్నానది నుంచి గుట్టుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. అందిన ముందస్తు సమాచారంతో గురువారం ఉదయం సిబ్బందితో కలసి ఇన్‌చార్జ్ ఎస్ఐ గౌస్‌బాషా అక్కడకు చేరుకున్నారు. ఆ సమయంలో టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్న విషయం గుర్తించి వెంటనే వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి రికార్డులు చూపకపోవడంతో టిప్పర్‌ను సీజ్ చేస్తూ వాహన యజమాని, తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన సంపయ్యతో పాటు డ్రైవర్ షెక్షావలిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి'

గుత్తి రూరల్: గుత్తి పట్టణంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ, మండలంలో లక్షకు పైగా జనాభా ఉందన్నారు. ప్రస్తుతం స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉండటంతో నేరాల అదుపు పోలీసులకు తలకు మించిన భారంగా మారిందన్నారు. గుత్తి మున్సిపాలిటీతో పాటు మండలంలో జరిగే నేరాలను దృష్టిలో పెట్టుకుని రూరల్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. రూరల్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల కేసుల పురోగతి వేగవంతంగా ఉండటంతో పాటుగా శాంతిభద్రతలు అదుపులో ఉంటాయన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో దేశభక్తి పెంపు



మాట్లాడుతున్న ఎంఈఓ జయానాయక్



ఎన్‌సీసీ క్యాడెట్లకు యూనిఫామ్ పంపిణీ దృశ్యం

పామిడి: ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో విద్యార్థి దశ నుంచే దేశభక్తి పెరుగుతుందని ఎంఈఓ జయానాయక్ అన్నారు.

గురువారం స్థానిక టీసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థుల యూనిఫామ్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ క్రమశిక్షణతో పాటు ఉపాధి కల్పనకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అనంతరం 80 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు రెండు జతల యూనిఫామ్, టీ షర్ట్, ఒక జత షూ, సాక్స్, బెల్ట్, క్యాప్, నేమ్ ప్లేట్, ఎన్‌సీసీ బ్యాడ్జెస్ తదితర అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సత్యనారాయణ, హెచ్‌ఎం రామ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి వై.రామాంజనేయులు, ఎక్స్ ఆర్మీ లక్ష్మీనారాయణ, ఆర్మీ సురేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'200 రోజుల పని దినాలు కల్పించాలి'



మహిళలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి

పుట్లూరు: ఉపాధి హామీ పథకం కింద వలసలను నివారించడానికి పనిదినాలను 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని నాయకునిపల్లిలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల సరుకులను దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ వేతనం రోజుకు రూ.600లు చెల్లించాలన్నారు. కూలీలకు పని ముట్లు అందించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో రేపు అంతరాయం

గుంతకల్లు: గుత్తి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రంగస్వామి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంతకల్లు టౌన్, రూరల్‌తోపాటు వజ్రకరూరు మండలంలో శనివారం ఉదయం 11.00 గంట నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

రేకులకుంటలో గ్రాడ్యుయేషన్ డే



అవగాహన కల్పిస్తున్న విమలా సుజాత

బుక్కరాయసముద్రం: మండలంలోని రేకులకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్ విమలా సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐదేళ్ల లోపు ఉన్న పిల్లలందరినీ అంగన్‌వాడీ బడిలో చేర్పించేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అశ్విని, రత్న, ఉమా, ఎర్రినాగమ్మ, ఎరికలమ్మ, సరస్వతి, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై నేడు అవగాహన

శింగనమల: శింగనమలలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు పంటల సాగు, తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్నారని మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్ గురువారం తెలిపారు. రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వసతి గృహ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శింగనమల: శింగనమలలోని బీసీ బాలుర వసతి గృహంలో సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ మస్తాన్ సూచించారు. వసతి గృహంలో 100 సీట్లు ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పదోతరగతి ఫలితాల్లో వసతి గృహంలో చదువుకున్న వారందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

పెద్దవడుగూరు: మండలంలోని ఎ.తిమ్మాపురం, లక్ష్మంపల్లి, మేడిమాకులపల్లి గ్రామాలకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. వారి రాజీనామా పత్రాలను జిల్లా అధికారులకు పంపామన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే కొత్తవారికి అవకాశాలు కల్పిస్తామన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

నార్పల: అప్పులబాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బి.పప్పూరులో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన రైతు రాంమోహన్‌రెడ్డి (40) తనకున్న నాలుగు ఎకరాల పొలంలో వివిధ రకాల పంటలు సాగుచేస్తూ జీవనం సాగించేవాడు కుటుంబ పోషణ, వ్యవసాయానికి పెట్టుబడి కోసం రూ.30 లక్షలు దాకా అప్పులు చేశాడు. పంటల సాగులో వరుసగా నష్టాలు రావడంతో కృంగిపోయిన రైతు నాలుగు రోజుల క్రితం బి.పప్పూరు గ్రామంలోని ఓ తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం ఆ తోట యజమాని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.